
సాక్షి
ఖమ్మం
మంగళవారం । 22 । జూలై । 2025



సూక్ష్మ సేద్యానికి సబ్సిడీ

నీటి వృథాను అరికట్టేలా రైతులకు సూక్ష్మ సేద్యం పరికరాలను సబ్సిడీపై ఇచ్చేందుకు అధికారులు ప్రణాళిక రూపొందించారు. 8లో



గెలుపే లక్ష్యంగా ప్రణాళిక

స్థానిక సంస్థల్లో విజయమే లక్ష్యంగా శ్రేణులు కృషి చేయాలని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు సూచించారు. 8లో

గరిష్టం / కనిష్టం
30° / 24°

వాతావరణం

జిల్లా అంతటా మంగళవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలు ప్రాంతాల్లో వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

పంచాయతీ కార్యదర్శులకు ప్రత్యేక లాగిన్

నేలకొండపల్లి: గ్రామపంచాయతీల్లో కొత్తగా ఓటరు జాబితా రూపకల్పన ప్రక్రియ మొదలు కానుంది. ఎన్నికలు ఎప్పుడైనా రావొచ్చనే సంకేతాలతో గత ఫిబ్రవరిలో కార్యదర్శులు జాబితా రూపొందించినా.. మార్పులు, చేర్పులతో కొత్తగా తయారు చేయాలనే ఆదేశాలు అందాయి. అంతేకాక ఈసారి పంచాయతీ కార్యదర్శులకే లాగిన్ ఇవ్వనున్నారు. గతంలో ఎంపీడీఓ లాగిన్ ద్వారానే ఓటరు జాబితా క్రోడీకరించేవారు. ఆపై తప్పులు దొర్లితే ఎంపీడీఓలు పరిశీలించి తిరిగి పంచాయతీ కార్యదర్శులకు పంపిస్తే సవరించేవారు. ఆపై జిల్లా పంచాయతీ అధికారి(డీపీఓ) పరిశీలించాక మళ్లీ సవరణలు అవసరమైన ఎండీపీఓలకు, అక్కడి నుంచి కార్యదర్శులకు అందేది. ఈసారి ఇదంతా లేకుండా నేరుగా పంచాయతీ కార్యదర్శులకే లాగిన్ ఇచ్చి టీ–పోల్ వార్డుల వారీగా ఓటరు జాబితా రూపొందించాలని ఆదేశించారు. అసెంబ్లీ ఎన్నికల ఓటరు జాబితాను ఎంపీడీఓలు పంపిస్తే ఈ ప్రక్రియ మొదలుపెట్టేలా శిక్షణ కూడా ఇచ్చారు.

రేపటి నుంచి 'నవోదయ' క్రీడాపోటీలు

కూసుమంచి: పాలేరులోని జవహర్ నవోదయ విద్యాలయలో క్లస్టర్ స్థాయి క్రీడా పోటీలు జరగనున్నాయి. ఇక్కడ బుధ, గురువారం జరిగే పోటీల్లో పాలేరు విద్యార్థులతో పాటు తెలంగాణలోని మిగతా నవోదయ విద్యాలయాల విద్యార్థులు పాల్గొంటారు. బాలబాలికలకు అండర్ -14, 17, 19 విభాగాల్లో కబడ్డీ, ఖో-ఖో, బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్, చెస్, యోగా పోటీలను నిర్వహిస్తారు. ఈ పోటీల్లో పాలేరు విద్యాలయం నుండి 68మంది, ఇతర జిల్లాల నుండి మరో 349 మంది విద్యార్థులు పాల్గొంటారు. పోటీల విజయవంతం కోసం అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు విద్యాలయ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు తెలిపారు.

ఆర్టీసీ రిజర్వేషన్‌లో రోటరీనగర్ పాయింట్

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మంలోని రోటరీనగర్ పాయింట్‌ను టీజీఎస్ ఆర్టీసీ అధికారులు రిజర్వేషన్ చార్ట్‌లో చేర్చారు. ఇన్నాళ్లు బస్సు ప్రయాణానికి రిజర్వేషన్ చేయించుకోవాలంటే ఖమ్మంలో కొత్త బస్టాండ్, కాల్వొడ్డు పాయింట్లు మాత్రమే ఉండేవి. దీంతో రాత్రి వేళ హైదరాబాద్, బెంగళూరు తదితర ప్రాంతాలకు వెళ్లాలన్నా, దూరప్రాంతాల నుండి ఖమ్మం వచ్చినా రోటరీనగర్, ఇందిరానగర్ ప్రాంతాలకు వెళ్లడానికి ఇక్కట్లు ఎదురవుతున్నాయి. ఈ నేపథ్యాన ప్రయాణికుల వినతితో ఖమ్మం ఆర్ఎం సరిరామ్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో సోమవారం సాయంత్రం నుంచి రోటరీనగర్ పాయింట్‌తో టికెట్లు రిజర్వేషన్ చేసుకునే సౌకర్యం అందుబాటులోకి వచ్చింది. ఫలితంగా రోటరీనగర్, ఇందిరానగర్ ప్రాంతాల నుంచి అటు భద్రాచలం, కొత్తగూడెం, ఇటు హైదరాబాద్ వెళ్లేందుకు ఈ పాయింట్‌ను ఎంచుకుని టికెట్ బుక్ చేసుకుని ఎక్కడమే కాక తిరుగు ప్రయాణంలోనూ దిగే వెసులుబాటు ఏర్పడింది. దీంతో ఈ ప్రాంత ప్రయాణికులు ఆర్టీసీ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

చెక్‌డ్యామ్ ఎత్తు తగ్గింపు పనులు ప్రారంభం



వరద వెళ్లేలా చప్టా తొలగించిన దృశ్యం

ఖమ్మంఅర్బన్: ఖమ్మం ప్రకాష్‌నగర్ వద్ద మున్నేటిపై ఉన్న చెక్‌డ్యామ్ ఎత్తు తగ్గింపు పనులు మొదలయ్యాయి. జలవనరుల శాఖ, రెవెన్యూ అధికారుల పర్యవేక్షణలో చెక్‌డ్యామ్ వద్దకు యంత్రాలు వెళ్లేలా అడ్డుగా ఉన్న గుట్రపు దెక్కను రెండు రోజులుగా తొలగిస్తున్నారు. ఇదే సమయాన చెక్‌డ్యామ్ దిగువన ప్రకాష్‌నగర్ వంతెన చప్టాకు గండ్లు పెట్టి వరద నీరు ముందుగా వెళ్లేలా ఏర్పాట్లు చేశారు. నగరాన్ని వరద ముంపు నుంచి రక్షించేందుకు చెక్‌డ్యామ్ ఎత్తు సగం మేర తగ్గించాలని నిర్ణయించిన విషయం విదితమే. ఈమేరకు వరద ప్రవాహం ఆధారంగా ఒకటి, రెండు రోజుల్లో గ్రానైట్ కట్టర్ సాయంతో చెక్‌డ్యాం ఎత్తు తగ్గించే పనులు చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు.

సీతారామా.. భూమి ఏదయా!?

- ప్రాజెక్టుకు అడ్డంకిగా భూసేకరణ
- ముందుకు సాగని కీలకమైన 13, 14వ ప్యాకేజీలు
- సత్తుపల్లి ట్రంక్, డిస్ట్రిబ్యూటర్లదీ అదే పరిస్థితి
- అటవీ భూముల సేకరణలో జాప్యంతో సమస్యలు

తిరుమలాయపాలెం వద్ద కొనసాగుతున్న కాల్వ నిర్మాణం



ఖమ్మం అర్బన్: రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకోవడమే కాక ఉమ్మడి జిల్లాకు వరప్రదాయినిగా నిలవనున్న సీతారామ ప్రాజెక్టు పనులకు కీలక దశలో అడ్డంకులు ఎదురవుతున్నాయి. ప్రధానంగా 13, 14వ ప్యాకేజీలతోపాటు, సత్తుపల్లి ట్రంకు కాల్వ, ఇతర డిస్ట్రిబ్యూటర్ల నిర్మాణానికి భూసేకరణలో జాప్యం జరుగుతోంది. ఈ నిర్మాణాలకు అటవీ భూమి అవసరమవుతోంది. దీంతో భూసేకరణ కోసం ఆ శాఖకు ప్రత్యామ్నాయంగా సుమారు 1,200 ఎకరాల భూమి అప్పగించాల్సిన అవసరం ఏర్పడింది. ఈనేపథ్యాన రెవెన్యూ, అటవీశాఖ సమన్వయంతో పనిచేయాల్సి ఉండగా.. జిల్లా మంత్రులు, ఉన్నతాధికారులు తరచూ సమీక్షిస్తున్నారు.

సరిపడా లభ్యత లేక..

అధికారిక లెక్కల ప్రకారం ఖమ్మం జిల్లాలో 516 ఎకరాలు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 640 ఎకరాలకుపైగా భూమిని అటవీశాఖకు ప్రత్యామ్నాయంగా కేటాయించాల్సి ఉంది. కానీ ఈ భూముల గుర్తింపునకు కసరత్తు చేస్తున్నా ఆ స్థాయిలో లభ్యత లేక అధికారులు మల్లగులాలు పడుతున్నట్లు తెలుస్తోంది. జిల్లాలో సీతారామ ప్రాజెక్టుకు సంబంధించి 13, 14వ ప్యాకేజీల పనులు పూర్తిస్థాయిలో జరగకపోవడానికి భూసేకరణే అడ్డంకిగా నిలుస్తోందని చెబుతున్నారు.

జిల్లాల పరిధిలో వేట

సీతారామ ప్రాజెక్టు నిర్మాణం 13, 14వ ప్యాకేజీలకు సంబంధించి అటవీ భూమిలో చేపట్టాల్సి ఉంది. కొన్నిచోట్ల ఆలయాలు, అసైన్డ్ భూములు కూడా ఉన్నాయి. ఆయా ప్రాంతాల్లో భూసేకరణకు అభ్యంతరాలు రాకపోయినా అంతే మొత్తంలో ఇతర చోట్ల భూమి కేటాయించాల్సి ఉంటుంది. ఏ జిల్లాలోనైనా అటవీశాఖకు భూములు అప్పగించే వీలున్న నేపథ్యాన ఉమ్మడి జిల్లాలోనే కాక ఆదిలాబాద్, మహబూబ్‌నగర్, ములుగు జిల్లాల్లోనూ అధికారులు అన్వేషిస్తున్నారు. అయితే, 13, 14వ ప్యాకేజీల పరిధిలో పనులు జరగకుండా.. 15, 16వ పరిధిలో పూర్తిచేసినా గోదావరి జలాలను పాలేరు రిజర్వాయర్‌లో కలిపే అవకాశం లేదు. ఈ విషయంలో ఏన్కూరు వద్ద లింక్ కెనాల్ నిర్మించినా పూర్తిస్థాయిలో ఫలితం రావడం లేదని తెలుస్తోంది. దీంతో అధికారులు శరవేగంగా భూసేకరణ, అప్పగింత పూర్తిచేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు. కాగా, ప్రాజెక్టులో ఇప్పటికే పూర్తయిన 15, 16వ ప్యాకేజీలకు గాను రూ.250 కోట్ల మేర బిల్లులు చెల్లించాల్సి ఉన్నట్లు సమాచారం.



15వ ప్యాకేజీలో భాగంగా తిరుమలాయపాలెం వద్ద జరుగుతున్న సొరంగం పనులు

భారీ కేటాయింపులు చేసినా..

ప్రాజెక్టు నిర్మాణాల కోసం ప్రభుత్వం రూ.13వేల కోట్లను కేటాయించినా, పలు సమస్యలతో దశాబ్దకాలంగా అనుకున్న స్థాయిలో పనులు ముందుకు సాగడంలేదు. ఇప్పుడు భూసేకరణ ఆటంకాలతో కాల్వల నిర్మాణం నిలిచిపోయే పరిస్థితి ఏర్పడింది. దీంతో సీతారామ ప్రాజెక్ట్ ద్వారా గోదావరి జలాలను కొంత మేరకైనా ఖమ్మం జిల్లా ఆయకట్టుకు ఇవ్వాలనే లక్ష్యంతో ఏన్కూరు వద్ద రూ.100 కోట్ల వ్యయంతో లింక్ కెనాల్ నిర్మించారు. కానీ డిజైన్ ప్రకారం చేపట్టాల్సిన పనుల్లో ఆలస్యంతో ప్రాజెక్టు ఎప్పటికి పూర్తవుతుందో స్పష్టత రావడం లేదు.

ప్యాకేజీల వారీగా భూఅవసరాలు, సేకరణ ఇలా...

13వ ప్యాకేజీ : మొత్తం 10.5 కిలోమీటర్ల పొడవుతో సాగనున్న ఈ ప్యాకేజీకి 167 ఎకరాల భూమి అవసరం. ప్రారంభం, చివరలో రెండేసి కిలోమీటర్ల చొప్పున పనులు చేసేందుకు నాలుగు కిలోమీటర్ల భూసేకరణ పూర్తయింది. మిగిలిన ఆరు కిలోమీటర్లకు సంబంధించిన భూమి సేకరించాల్సి ఉంది.

14వ ప్యాకేజీ : ఈ ప్యాకేజీలో ప్రాజెక్టు నిర్మాణ పనులకు అత్యధికంగా 1,025 ఎకరాల భూమి అవసరమని గుర్తించారు. కానీ కేవలం 286 ఎకరాల సేకరణే పూర్తయింది.

15వ ప్యాకేజీ : ఈ ప్యాకేజీలో పనులకు 740 ఎకరాల భూమి అవసరం. ఇందులో 650 ఎకరాలు సేకరించడంతో చకచకా జరుగుతున్నాయి. ఇంకా 90ఎకరాలు కావాల్సి ఉంది.

16వ ప్యాకేజీ : ప్రాజెక్టులో భాగంగా ఈ ప్యాకేజీ పనులకు అవసరమైన 330 ఎకరాల్లో 319 ఎకరాల సేకరణ పూర్తయింది. దీంతో పనులు వేగంగా సాగుతున్నాయి. పూర్తి స్థాయిలో పనులు జరిగేలా మరో 25ఎకరాల సేకరణ కోసం కసరత్తు చేస్తున్నారు.

ఆ పదవులు.. వరించేదెవరినో?



- కాంగ్రెస్‌లో సంస్థాగత పదవులపై ఆశలు
- ఆశావహుల పేర్లు సేకరించిన ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి
- పార్టీతోపాటు నామినేటెడ్ పదవులపైనా నేతల దృష్టి
- స్థానిక ఎన్నికలకు ముందా, తర్వాత భర్తీ చేస్తారా అని చర్చలు

సాక్షిప్రతినిధి, ఖమ్మం: సుదీర్ఘకాలం తర్వాత కాంగ్రెస్‌లో సంస్థాగత పదవుల నియామకాలు చేపట్టనున్నట్లు ప్రకటించడం ఆశావహుల్లో ఆశలు రేకెత్తిస్తోంది. పార్టీలో బూత్ కమిటీ మొదలు జిల్లా స్థాయి వరకు అన్ని పదవులతోపాటు రాష్ట్రస్థాయిలో కొన్ని నామినేటెడ్ పదవులు భర్తీ చేయనున్నట్లు చెబుతున్నారు. కానీ ఇది ఎప్పుడు జరుగుతుందోనన్న సంశయం నేతలను వెంటాడుతోంది. స్థానిక సంస్థల ఎన్నికల దృష్ట్యా ముందుగానే నియామకాలు చేపడతారని తొలుత ప్రచారం జరిగింది. కానీ పదవులు ఆశిస్తున్న వారి సంఖ్య ఎక్కువగా ఉండడంతో వడపోతకు సమయం పట్టనుండడం.. ఇతర పరిణామాలను అంచనా వేశాక ఎన్నికల తర్వాతే భర్తీ చేయాలనే నిర్ణయానికి వచ్చినట్లు తాజాగా ప్రచారం మొదలైంది.

జిల్లా ఇన్‌చార్జ్ పర్యటన

కాంగ్రెస్‌ను సంస్థాగతంగా పటిష్టం చేయాలని అధిష్టానం నిర్ణయించిన నేపథ్యాన జిల్లా, మండల, గ్రామస్థాయి కమిటీల నియామకానికి ఇన్‌చార్జిలను నియమించింది. ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జిగా నియమితులైన చల్లా వంశీచంద్‌రెడ్డి ఈనెల 11న ఖమ్మంలో పర్యటించి పార్టీ, నామినేటెడ్ పదవులకు పేర్లు సేకరించారు. ఆపై జాబితాలను అధిష్టానానికి సమర్పించినట్లు తెలిసింది. ఈక్రమంలో అన్ని కమిటీలకు భారీ స్థాయిలోనే దరఖాస్తులు అందినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. మరోవైపు ప్రజాప్రతినిధులు, జిల్లా అధ్యక్షులు కూడా జిల్లా కమిటీకి సంబంధించి పలువురి పేర్లు ప్రతిపాదించారు. కాంగ్రెస్‌లో 2018 తర్వాత సంస్థాగతంగా పదవుల భర్తీ మళ్లీ ఇప్పుడే జరుగుతుండడంతో ఏళ్లుగా పార్టీనే నమ్ముకున్న వారిలో ఉత్సాహం నెలకొంది.

స్థానిక పోరు తర్వాతేనా?

తొలుత స్థానిక సంస్థల ఎన్నికలే లక్ష్యంగా పదవులు భర్తీ చేయాలని భావించినా.. ఆ తర్వాత పార్టీ వెనక్కి తగ్గినట్లుగా తెలుస్తోంది. మండల కాంగ్రెస్ అధ్యక్ష పదవులతో జిల్లా కమిటీకి భారీ స్థాయిలో ఆశావహులు దరఖాస్తు చేసుకున్నారు. అలాగే బలహీన వర్గాల నేతలు కూడా ప్రాధాన్యత కల్పించాలని ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జికి విజ్ఞప్తి చేశారు. ఇలా అందరి పేర్లు పరిశీలించడం, అర్హతలు, ప్రజల్లో ఆదరణను గుర్తించడానికి కొంత సమయం పడుతుందనే చర్చ జరుగుతోంది. అందరికీ ఆమోదయోగ్యమైన వారికే పదవులు కట్టబెట్టాలనే లక్ష్యంతో అధిష్టానం ఉన్నందున ఇప్పటికిప్పుడు భర్తీ జరగకపోవచ్చని తెలుస్తోంది. మరోవైపు ఇబ్బడిముబ్బడిగా దరఖాస్తులు వచ్చినందున స్థానిక సంస్థల ఎన్నికలకు ముందు భర్తీ చేస్తే పదవులు రాని వారిలో అసంతృప్తికి బీజం వేసినట్లు అవుతుందనే ఆలోచనలో పార్టీ నాయకత్వం ఉన్నట్లు సమాచారం. ఎన్నికల తర్వాత భర్తీ చేస్తామనే సంకేతాలు పంపితే ఆశావహులు మరింత కష్టపడి పనిచేస్తారని, ఆ తర్వాత పార్టీ పదవులు భర్తీ చేసుకోవచ్చనే నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది. దీంతో ఇప్పుడే పదవుల భర్తీ చేయకపోయినా, ఎన్నికల తర్వాత మాత్రం కచ్చితంగా ఉంటాయని తెలుస్తోంది.

త్వరలోనే గ్రామపంచాయతీలతోపాటు ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు జరగనున్నాయి. ఈనేపథ్యాన క్షేత్రస్థాయిలో పార్టీ పటిష్టంగా ఉండాలనే ఉద్దేశంతో గ్రామ, మండల స్థాయి కమిటీల భర్తీ చేపట్టాలని కాంగ్రెస్ అధిష్టానం నిర్ణయించింది. దీంతో మండల అధ్యక్ష పదవుల కోసం పేర్లు సేకరించారు. జిల్లా కమిటీ సభ్యుల నియామకానికి ప్రతిపాదనలు సేకరించినా.. జిల్లా అధ్యక్ష పదవి భర్తీకి సమయం పడుతుందని పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. కొత్త అధ్యక్షులైతే ఎన్నికల వేళ కీలకంగా పనిచేస్తారనే భావనతో మండల స్థాయి కమిటీలపై పూర్తి స్థాయిలో దృష్టి పెట్టిన ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి.. ఆ పేర్లను సేకరించినట్లు తెలిసింది.

సంక్రాంతికల్లా మోడల్ మార్కెట్ సిద్ధం

- ఖమ్మంలో సరికొత్త హంగులతో నిర్మాణం
- రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మంవ్యవసాయం: సరికొత్త హంగులతో నిర్మిస్తున్న ఖమ్మం మోడల్ మార్కెట్ సంక్రాంతి నాటికి అందుబాటులోకి వస్తుందని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఖమ్మం మార్కెట్‌లోని 15.39 ఎకరాల్లో రూ.155.30 కోట్లతో నిర్మిస్తున్న మోడల్ మిర్చి మార్కెట్ పనులను సోమవారం మంత్రి పరిశీలించారు. ఈసందర్భంగా పనుల పురోగతిపై అధికారులు, కాంట్రాక్టు సంస్థ ప్రతినిధులతో చర్చించాక మంత్రి మాట్లాడారు. ఖమ్మం మార్కెట్‌కు మిర్చి సీజన్‌లో లక్షలాది బస్తాల సరుకు వస్తుండడంతో ఇబ్బందులు ఎదురుకాకుండా తాను పాలేరు ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు మద్దులపల్లి మార్కెట్‌ను మంజూరు చేయించానని తెలిపారు. ఇప్పుడు ఖమ్మం మార్కెట్‌ను దేశంలోనే మోడల్‌గా తీర్చిదిద్దేందుకు నిర్మాణాలు చేపడుతున్నట్లు చెప్పారు. తొలుత నిర్మాణ కంపెనీ ప్రతినిధి సురేష్ మోడల్ మార్కెట్ డిజైన్, నిర్మాణ పనుల పరోగతిని వివరించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ యరగర్ల హన్మంతరావు, మార్కెటింగ్ శాఖ ఏడీ రవికుమార్, వరంగల్ రీజినల్ జాయింట్ డైరెక్టర్ ఉప్పల శ్రీనివాస్, డీసీసీబీ చైర్మన్ డి.వెంకటేశ్వరరావు, ఖమ్మం మేయర్ పి.నీరజ, మార్కెట్ కార్యదర్శి పి ప్రవీణ్‌కుమార్, వైస్ చైర్మన్ తల్లాడ రమేష్, తదితరులు పాల్గొన్నారు.

● **ఖమ్మంసహకారనగర్:** రైతులకు అవసరమైన యూరియా సరఫరాలో కేంద్రప్రభుత్వం నుంచి సరైన సహకారం అందడం లేదని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. అయినా రాష్ట్రంలో రైతులు ఇబ్బంది పడకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. హైదరాబాద్ నుంచి సీఎం రేవంత్‌రెడ్డి, బోనకల్ నుంచి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించగా ఖమ్మం కలెక్టరేట్ నుంచి అదనపు కలెక్టర్లు డాక్టర్ పి.శ్రీజ, పి.శ్రీనివాసరెడ్డితో కలిసి తుమ్మల పాల్గొన్నారు. వానాకాలం సాగు సక్రమంగా జరిగేలా కేంద్రప్రభుత్వం నుంచి అవసరమైన మొత్తంలో యూరియా అందలేదని, అయినా ఇక్కట్లు రాకుండా పర్యవేక్షిస్తున్నామని చెప్పారు. ఇదేసమయాన బ్లాక్ మార్కెట్‌కు తరలించకుండా అధికారులు తనిఖీలు చేయాలని సూచించారు.



మోడల్ మార్కెట్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మంత్రి తుమ్మల, తదితరులు

● **ఖమ్మంఅర్బన్:** జిల్లాలో అభివృద్ధి పనులు వేగంగా పూర్తిచేసేలా అధికారులు పర్యవేక్షించాలని రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఆయన వివిధ శాఖల అధికారుల సమావేశమై మాట్లాడారు. మంచుకొండ ఎత్తిపోతల పథకం ట్రయల్ రన్ ద్వారా ఈనెల 24న అన్ని చెరువులకు నీరు అందించాలని తెలిపారు. అలాగే, అక్కడ సబ్‌స్టేషన్ నిర్మాణం, హైవేలో హైటెన్షన్ లైన్ తొలగింపు, వెలుగుమట్ల అర్బన్ పార్క్‌కు నీరు అందించేలా పైప్‌లైన్ ఏర్పాటు, మార్కెట్ యార్డు సమీపాన రహదారి విస్తరణతో గృహాలు కోల్పోయిన వారికి ప్రత్యామ్నాయంగా ఇళ్ల కేటాయింపు, నగర మాస్టర్ ప్లాన్ ముసాయిదా తయారీపై సూచనలు చేశారు. ఈసమావేశంలో అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, ఖమ్మం ఆర్‌డీఓ నర్సింహారావు, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్యతో పాటు జలవనరులశాఖ ఎస్‌ఈ ఎం.వెంకటేశ్వర్లు, ఈఈలు అనన్య, బాబూరావు, తహసీల్దార్ సైదులు పాల్గొన్నారు.

రేషన్‌కార్డులతో ఆహారభద్రత

- 93లక్షల కుటుంబాలకు సన్నబియ్యం పంపిణీతో రికార్డు
- సమపాళ్లలో అభివృద్ధి, సంక్షేమం
- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

బోనకల్: రేషన్‌కార్డుల ద్వారా పేదలకు ఆహారభద్రత లభిస్తోందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క వెల్లడించారు. బోనకల్‌లో సోమవారం ఆయన నియోజకవర్గవ్యాప్తంగా ఇటీవల మంజూరైన రేషన్‌కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ పదేళ్ల పాలనలో బీఆర్ఎస్ ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులు ఇవ్వకుండా పేదలను ఇబ్బంది పెట్టిందని ఆరోపించారు. కానీ తాము అధికారంలోకి రాగానే అర్హత కలిగిన పేదలందరికీ రేషన్‌కార్డులు ఇచ్చేలా చర్యలు చేపట్టామని తెలిపారు. రాష్ట్రంలో 1.15కోట్ల కుటుంబాలు ఉండగా 93లక్షల కుటుంబాలకు రేషన్‌కార్డులు ఇవ్వడమే కాక సన్నబియ్యం పంపిణీతో దేశంలోనే రికార్డు సృష్టించామని చెప్పారు. జిల్లాలో 19,690 కార్డులు కొత్తగా మంజూరు చేశామని, మధిర నియోజకవర్గంలో 4,736 కొత్త కార్డులు మంజూరు చేయడంతో పాటు 13,767 మంది పేర్లను చేర్చామని తెలిపారు. ఇక 200యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సరఫరాతో రాష్ట్రంలో 51 లక్షల కుటుంబాలకు, రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితి పెంపుతో 93లక్షల కుటుంబాలకు లబ్ధి జరిగిందని వెల్లడించారు. కేవలం సంక్షేమ కార్యక్రమాలే కాక అభివృద్ధిని సమపాళ్లలో చేపడుతూ రాష్ట్రాన్ని ఆదర్శంగా నిలుపుతున్నామని డిప్యూటీ సీఎం తెలిపారు. తొలుత బోనకల్ మండలంలోని చిరునోములలో రూ.1.72కోట్లు, రావినూతల గ్రామంలో రూ.1.62కోట్లతో నిర్మించే సీసీ రోడ్లకు భట్టి విక్రమార్క శంకుస్థాపన చేశారు.



బోనకల్ : మహిళకు రేషన్‌కార్డు మంజూరుపత్రం అందజేస్తున్న డిప్యూటీ సీఎం భట్టి, పక్కన వైరా ఎమ్మెల్యే రాందాస్ తదితరులు

దశల వారీగా ఇందిరమ్మ బిల్లులు

చింతకాని: మండలంలోని గాంధీనగర్ కాలనీలో రూ.20లక్షల వ్యయంతో నిర్మించిన గ్రామపంచాయతీ భవనాన్ని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సోమవారం ప్రారంభించారు. అలాగే, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ లబ్ధిదారులు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం త్వరగా చేపట్టాలని, తద్వారా దశల వారీగా బిల్లులు మంజూరవుతాయని తెలిపారు. కాగా, డిప్యూటీ సీఎం భట్టి చింతకాని మండలంలోకి ప్రవేశించగానే భారీ వర్షం మొదలవడంతో ఆ వర్షంలోనే గ్రామపంచాయతీ కార్యాలయాన్ని ప్రారంభించాక రైతువేదికలో దళితబంధు లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, రాష్ట్ర హస్తకళల కార్పొరేషన్ చైర్మన్ నాయుడు సత్యం, వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్, డీసీసీబీ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు, వివిధ శాఖల జిల్లా అధికారులు కస్తాల సత్యనారాయణ, నవీన్‌బాబు, సన్యాసయ్య, చందన్‌కుమార్, ధనసరి పుల్లయ్య, ఆశాలత, శ్రీనివాసాచారి, సునీల్‌రెడ్డి, ఆర్‌డీఓ నరసింహారావు, తహసీల్దార్లు కరుణాకర్‌రెడ్డి, రమాదేవి, ఎంపీడీఓలు శ్రీనివాసరావు, రమాదేవి, ఆత్మ, మార్కెట్ చైర్మన్లు కె.రామకోటేశ్వరరావు, బి.నర్సింహారావు, ఏఓ మానసతో పాటు నాయకులు పైడిపల్లి కిషోర్, బందం నాగేశ్వరావు, గాలి దుర్గారావు, పి.నాగేశ్వరరావు, షాజహాన్, జానీమియా, బి.వెంకటేశ్వర్లు, మురళి, ముస్తఫా, శాస్త్రి, వెంకటేశ్వర్లు, రామకృష్ణ, భద్రునాయక్, ప్రమీల పాల్గొన్నారు.



చింతకాని : గాంధీనగర్‌కాలనీలో జీపీ భవనాన్ని ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, పక్కన కలెక్టర్ అనుదీప్ తదితరులు

ఊపిరి పోసిన వాన

జిల్లా అంతటా వర్షంతో పంటలకు ప్రయోజనం

ఖమ్మంవ్యవసాయం: జిల్లా వ్యాప్తంగా సోమవారం మధ్యాహ్నం నుంచి రాత్రి పొద్దుపోయే వరకు వర్షం కురిసింది. కొద్దిరోజుల విరామం తర్వాత కురిసిన ఈ వర్షం అన్నదాతల్లో ఆనందాన్ని నింపింది. అంతేకాక ఉక్కపోతతో సతమతమవుతున్న జనానికి ఉపశమనం కలిగించినట్లయింది. సోమవారం ఉదయం నుంచే వాతావరణంలో మార్పులు చోటు చేసుకోగా, మధ్యాహ్నం 12 గంటల నుంచి వాన మొదలై రాత్రి వరకు విడతల వారీగా కొనసాగింది. అత్యధికంగా చింతకాని మండల కేంద్రంలో 62.3 మి.మీ. వర్షపాతం నమోదైందని అధికారులు వెల్లడించారు. అలాగే, మధిరలో 51.8, సిరిపురంలో 50.3, ఖమ్మం ఖానాపురంలో 48.3, పెద్దగోపతిలో 47.5, మధిర ఏఆర్ఎస్ వద్ద 45.8, ముదిగొండలో 45.5, పమ్మిలో 41.8, నాగులవంచలో 37.3, పెనుబల్లిలో 35, సత్తుపల్లి ఓసీ వద్ద 34, ఎర్రుపాలెంలో 33.8, కలెక్టరేట్ వద్ద 33.3, సత్తుపల్లిలో 29.3, ఖమ్మం ప్రకాష్‌నగర్‌లో 28.3, తిరుమలాయపాలెంలో 26.5, గుబ్బగుర్తిలో 26.3, వేంసూరులో 25.5, నేలకొండపల్లిలో 22.3, బాణాపురంలో 22, కల్లూరులో 20.3, ఏన్కూరులో 20 మి.మీ. వర్షపాతం నమోదైంది. ఈ వర్షం పత్తి, పెసర, చెరకు, మొక్కజొన్నకు ప్రయోజనం చేకూర్చనుండగా, వరినాట్లకు దోహదపడనుంది.

రాకపోకలు బంద్

తల్లాడ: తల్లాడ మండలం బిల్లుపాడు, వెంగన్నపేట, నూతనకల్ మధ్య వాగులు భారీ వర్షంతో పొంగి ప్రవహించాయి. బిల్లుపాడు వాగు లోలెవల్ కాజ్‌వేపైకి వరద నీరు చేరింది. అలాగే, వెంగన్నపేట వద్ద కల్లూరు వాగు లోలెవల్ బ్రిడ్జిపైకి సైతం నీరు చేరడంతో రాకపోకలు నిలిచిపోయాయి. వెంగన్నపేట, ముచ్చ గూడూరు, వెంకట్రామునితండా వాసులు ఇటు తల్లాడ, అటు కల్లూరు వైపు వెళ్లడానికి దారి లేక ఇబ్బంది పడ్డారు.



తల్లాడ : బిల్లుపాడు సమీపాన కాజ్‌వే పైకి చేరిన వాగు నీరు

ఇది ఖైదీల శ్రమ..

జిల్లా జైలులో శిక్ష అనుభవిస్తున్న ఖైదీలతో వనమహోత్సవం అవసరాల కోసం 14వేల సీడ్ బాల్స్ తయారు చేయించారు. చింత, వేప, కానుగ, రెల్ల, కుంకుడు తదితర విత్తనాలతో వీటిని రూపొందించారు. ఈమేరకు ఖమ్మంలోని వెలుగుమట్ల అర్బన్ పార్క్, పరిసర ప్రాంతాల్లో జిల్లా జైలు అధికారులు, అటవీ శాఖ ఉద్యోగులు సోమవారం వీటిని విసిరారు. తొలుత పార్క్‌లో పలు మొక్కలు నాటారు. జిల్లా జైలు సూపరింటెండెంట్ శ్రీధర్, జైలర్ జి.లక్ష్మీనారాయణ, డిప్యూటీ జైలర్లు ఏ.సుభాష్, కె.హన్మంతరావుతో పాటు ఫారెస్ట్ డివిజన్ ఆఫీసర్ కె.వెంకన్న, రేంజ్ ఆఫీసర్లు జి.నాగేశ్వరరావు, బి.శ్రీనివాసరెడ్డి, పి.శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



పార్క్‌లో విత్తనాల బంతులు విసురుతున్న ఉద్యోగులు

– ఖమ్మం అర్బన్ / ఖమ్మం రూరల్

క్లుప్తంగా

నేడు, రేపు మంత్రి తుమ్మల పర్యటన

ఖమ్మంఅర్బన్: రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మంగళ, బుధవారాల్లో ఉమ్మడి జిల్లాలో పర్యటించనున్నారు. ఖమ్మంలోని విజయ డెయిరీ యూనిట్‌ను మంగళవారం ఉదయం పరిశీలించనున్న మంత్రి నిర్వహణపై అధికారులతో సమీక్షిస్తారు. ఆతర్వాత ఖమ్మం 15వ డివిజన్‌లో సీసీ రోడ్లు, డ్రెయినేజీ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. ఇక బుధవారం కొత్తగూడెంలోని ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ క్యాంపస్‌ను సందర్శించి ఉన్నతాధికారులతో సమీక్షలో పాల్గొంటారు. ఆపై సాయంత్రం 3 గంటలకు రఘునాథపాలెం మండలం పరికల బోడు తండాలో రహదారుల నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేయనున్నారు.

గూడ్స్ రైలు నుంచి విడిపోయిన బోగీలు


కారేపల్లి గేట్ వద్ద నిలిచిపోయిన బోగీలు

కారేపల్లి: లింక్ ఊడిపోవడంతో గూడ్స్ రైలు నుంచి కొన్ని బోగీలు విడిపోయిన ఘటన కారేపల్లి మండలం గేటుకారేపల్లి స్టేషన్ సమీపాన సోమవారం రాత్రి చోటు చేసుకుంది. డోర్నకల్ జంక్షన్ నుంచి కారేపల్లి రైల్వే జంక్షన్ మీదుగా ఖాళీ బోగీలతో గూడ్స్ రైలు కొత్తగూడెం వైపు వెళ్తోంది. గేటుకారేపల్లి స్టేషన్ సమీపానికి వచ్చే సరికి కొన్ని బోగీలకు లింగ్ ఊడిపోయింది. దీంతో కొన్ని బోగీలను వదిలేసి ఇంజిన్ ఇంకొన్ని బోగీలతో వెళ్తుండడాన్ని గేటుకారేపల్లి, అనంతారం గేట్‌మెన్లు గుర్తించి అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో డ్రైవర్‌ను అప్రమత్తం చేసి గూడ్స్ రైలును నిలిపివేయగా, ఆతర్వాత సిబ్బంది చేరుకుని ఊడిపోయిన బోగీలను మరో ఇంజన్ సాయంతో తీసుకొచ్చి జత చేశారు. దీంతో అరగంట తర్వాత గూడ్స్ రైలు ముందుకు కదిలింది. ఇదే సమయాన గేటుకారేపల్లి, అనంతారం గేట్లను మూసివేయడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి.

పాత భవనాలతో భయం.. భయం


పాత మసీదు సెంటర్‌లో కూలిన ఇంటి గోడ

కూసుమంచి: కూసుమంచిలోని పాత మసీదు సెంటర్‌లో శిథిలావస్థకు చేరిన భవనాలతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ఇళ్ల గోడలు కొద్దికొద్దిగా కూలిపోతున్నాయి. ఈక్రమాన పూర్తిస్థాయిలో కూలితే ఆ సమయాన ఎవరైనా అటుగా వెళ్తే ప్రమాదం జరిగే అవకాశం ఉంది. అధికారులు స్పందించి శిథిల గృహాలను కూల్చివేయించాలని స్థానికులు కోరుచుకున్నారు.

కోల్ మూమెంట్ ఈడీగా వెంకన్న


ఈడీ వెంకన్నను అభినందిస్తున్న సీఎండీ

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కోల్ మూమెంట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా బి.వెంకన్న సోమవారం బాధ్యతలు చేపట్టారు. 2010 ఇండియన్ రైల్వే ట్రాఫిక్ సర్వీసెస్(ఐఆర్‌టీఎస్) బ్యాచ్‌కు చెందిన వెంకన్న మూడేళ్ల పాటు డిప్యుటేషన్‌పై ఈ పదవిలో కొనసాగనున్నారు. ఈ మేరకు హైదరాబాద్‌లో బాధ్యతలు స్వీకరించాక సీఎండీ ఎన్.బలరామ్‌ను కలిశారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ సింగరేణి సంస్థలో ఏటా సుమారు 700 లక్షల టన్నుల బొగ్గు రవాణా అవుతుందని, ఇందులో అధిక భాగం రైల్వే ద్వారానే సరఫరా చేస్తామని తెలిపారు. వార్షిక లక్ష్యాల సాధనలో కోల్ మూమెంట్ విభాగం కీలకంగా నిలుస్తున్నందున ఈడీ పర్యవేక్షించాల్సి ఉంటుందని చెప్పారు. అనంతరం ఈడీ మాట్లాడుతూ సంస్థ లక్ష్యాల సాధనకు అందరి సహకారంతో కృషి చేస్తానని వెల్లడించారు.

సూక్ష్మ సేద్యానికి సబ్సిడీ

- 80 – 100 శాతం రాయితీపై పరికరాలు
- జిల్లాలో 24 వేల ఎకరాలకు సమకూర్చేలా ప్రణాళిక
- ఒక్కో రైతుకు 12.20ఎకరాల వరకు అవకాశం


కూరగాయల తోటలో డ్రిప్ ద్వారా ఏర్పాటుచేసిన పైపులైన్లు

ఖమ్మంవ్యవసాయం: పంటల సాగులో నీరు పొదుపు చేసేలా వినియోగించే సూక్ష్మ సేద్యం విధానాన్ని ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. ఈ విధానంలో నీటిని నేరుగా మొక్కల వేర్ల దగ్గర చుక్కలుచుక్కలుగా విడుదల చేయనుండడంతో ఎక్కడా వృథా అయ్యే అవకాశముండదు. అంతేగాక ఎరువులను కూడా నీటిలో కలిపి సరఫరా చేసే అవకాశముండడంతో కలుపు, మట్టి కోత సమస్యలు తగ్గిపోతాయి. ఈమేరకు రాష్ట్రీయ కృషి వికాస యోజన పథకం(ఆర్‌కేవీవై) కింద సూక్ష్మ సేద్య పరికరాల కొనుగోలుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 60–40 నిష్పత్తిలో రైతులకు నిధులు మంజూరు చేస్తున్నాయి.

ఎస్సీ, ఎస్టీలకు వంద శాతం రాయితీ

నీటి పొదుపును ప్రోత్సహించడం, డ్రిప్ పరికరాలను వివిధ వర్గాల రైతులకు చేరువ చేసేలా ప్రభుత్వం రాయితీలను ప్రకటించింది. ఈమేరకు ఎస్సీ, ఎస్టీ రైతులకు 100 శాతంపై, బీసీ రైతులకు 90 శాతంపై, జనరల్(ఓసీ) రైతులైతే 80 శాతంపై సూక్ష్మ సేద్య పరికరాలను ఉద్యాన శాఖ ద్వారా అందించనున్నారు. జిల్లాలో ఆయిల్ పామ్, మిర్చి, పత్తి, మొక్కజొన్న, పండ్ల తోటలు, కూరగాయలు సాగు చేసే రైతులకు ఈ పథకం ద్వారా లబ్ధి జరగనుంది.

ఆయిల్‌పామ్‌కు ప్రాధాన్యత

సూక్ష్మసేద్యం విధానాన్ని ఆయిల్ పామ్ తోటల్లో అమలుకు ప్రాధాన్యత ఇవ్వనున్నారు. ఈ ఏడాది జిల్లాలో 21,275 ఎకరాల ఆయిల్ పామ్ తోటలకు సూక్ష్మ సేద్య పరికరాలు అందించాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించింది. దీంతో పాటు మిర్చి, పత్తి, మొక్కజొన్న, పండ్ల తోటలు, కూరగాయలు తదితర పంటలు మరో 3వేల ఎకరాలకు సైతం అందించాలని ఉద్యాన శాఖకు ఆదేశాలు అందాయి.

రూ.93.82 కోట్లు మంజూరు

జిల్లాలో ఈ ఏడాది సూక్ష్మ సేద్య పథకానికి ప్రభుత్వం రూ.93.82 కోట్లు మంజూరు చేసింది. ఇందులో ఆయిల్‌పామ్ తోటలకు రూ. 63.82 కోట్లు, మిగతా పంటలకు రూ.30 కోట్లు కేటాయించారు. ఆయిల్ పామ్ ఎకరాకు రూ.30వేల చొప్పున, మిర్చి, పత్తి, మొక్కజొన్న, పండ్లు, కూరగాయల పంటలకు ఎకరాకు రూ.లక్ష విలువైన సూక్ష్మ సేద్య పరికరాలను అందిస్తారు. పరికరాల సరఫరా కోసం పది కంపెనీలు అందుబాటలో ఉండగా, అర్హులైన రైతులు కంపెనీని ఎంచుకుని, ధ్రువపత్రాలతో మీ సేవా కేంద్రంలో రిజిస్ట్రేషన్ చేసువావాల్సి ఉంటుంది. ప్రభుత్వ రాయితీతో సూక్ష్మ సేద్య పరికరాలను వినియోగించుకుంటూ ఏడేళ్ల గడిచిన రైతులు కూడా మళ్లీ దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని కల్పించారు. ఒక్కో రైతుకు గరిష్టంగా 12.20 ఎకరాల వరకు సబ్సిడీ పరికరాలు అందిస్తారు.

రైతులు వినియోగించుకోవాలి



పంటల సాగుకు ప్రయోజనకరమైన సూక్ష్మ సేద్య పరికరాలను ప్రభుత్వం రాయితీపై సరఫరా చేయనుంది. 80నుంచి 100 శాతం వరకు రాయితీ అందనుంది. ఆయిల్ పామ్ రైతులకు ప్రాధాన్యత ఇస్తున్నందున ఆసక్తి ఉన్న వారు మీ సేవ కేంద్రాల దరఖాస్తు చేసుకోవాలి. – ఎం.వీ.మధుసూదన్, జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమాధికారి

గెలుపే లక్ష్యంగా ప్రణాళిక

బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు


మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, పక్కన నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం: త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికలను బీజేపీ శ్రేణులు ప్రతిష్టాత్మకంగా తీసుకుని విజయమే లక్ష్యంగా పనిచేయాలని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు సూచించారు. ఖమ్మంలో సోమవారం నిర్వహించిన ప్రత్యేక కార్యశాలలో ఆయన మాట్లాడారు. వచ్చే ఎన్నికలు నాయకులవి కాక కార్యకర్తలవిగా భావించాలని తెలిపారు. గ్రామాల అభివృద్ధికి కేంద్రప్రభుత్వం నుంచి అత్యధిక నిధులు వస్తున్న అంశాన్ని ప్రజల్లో విస్తృతంగా తీసుకెళ్లాలని చెప్పారు. రాష్ట్రంలో ఇందిరమ్మ ఇల్లు, రేషన్ కార్డులు అనర్హులలకే అందుతున్న అంశాన్ని వివరించాలని పేర్కొన్నారు. గ్రామీణ స్థాయిలోని ప్రతీ స్థానంలో బీజేపీ శ్రేణులు పోటీ దిగేలా కార్యచరణ సిద్ధం చేసుకోవాలని సూచించా రు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు మాట్లాడుతూ రుణమాఫీ, వరి ధాన్యం సాగుచేసిన రైతులకు బోనస్ చెల్లింపులో ప్రభుత్వం విఫలమైన తీరును ప్రజల్లోకి తీసుకెళ్లడం ద్వారా స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా కన్వీనర్ ఈ.వీ.రమేష్, నాయకులు గెంటాల విద్యాసాగర్, దొంగలు సత్యనారాయణ, సన్నే ఉదయ్‌ప్రతాప్, వాసుదేవ రావు, డి.వెంకటేశ్వరావు, నున్నా రవి, రామలింగేశ్వరరావు, మేకల నాగేందర్, రుద్ర ప్రదీప్, కుమిలి శ్రీనివాస్, రుద్రగాని మాధవ్, పుల్లారావు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.


సమష్టి నిర్ణయంతో బాధ్యతలు నిర్వర్తించండి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి సాంబశివరావు


సురేష్, జితేందర్‌రెడ్డిని సత్కరిస్తున్న కూనంనేని సాంబశివరావు

ఖమ్మంమయూరిసెంటర్: సీపీఐ జిల్లా సమితి బాధ్యులు సమష్టిగా నిర్ణయాలు తీసుకుంటూ పార్టీ పటిష్టతకు పాటుపడుతూనే ప్రజల సమస్యలపై ఉద్యమించాలని పార్టీ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు సూచించారు. ఇటీవల మహాసభల్లో జిల్లా కార్యదర్శిగా ఎన్నికై న దండి సురేష్, సహాయ కార్యదర్శిగా ఎన్నికైన జమ్ముల జితేందర్ రెడ్డి సోమవారం జిల్లా కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో కూనంనేని పాల్గొని వారిని సన్మానించాక మాట్లాడారు. పాలక వర్గాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై బహుముఖ పోరాటాలకు కేడర్‌ను సిద్ధం చేయాలన్నారు. అలాగే, పార్టీ శత వసంతాల ముగింపు సభ డిసెంబర్ 26న ఖమ్మంలో జరగనుండగా ఇప్పటి నుంచే ఏర్పాట్లపై దృష్టి సారించాలని సూచించారు. అలాగే, కార్యదర్శి దండి సురేష్, సహాయ కార్యదర్శిగా ఎన్నికైన జమ్ముల జితేందర్‌రెడ్డి తదితరులు పార్టీ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావుతో కలిసి పార్టీ సీనియర్ నాయకుడు పువ్వాడ నాగేశ్వరరావును కలిశారు.ఈ సందర్భంగా పార్టీ బలోపేతం, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో నాయకులు కొండపర్తి గోవిందరావు, సిద్ధినేని కర్ణకుమార్, శింగు నర్సింహారావు, తాటి వెంకటేశ్వరరావు, యర్ర బాబు, రావి శివరామకృష్ణ, పుచ్చకాయల కమలాకర్, మేకల శ్రీనివాసరావు, రవీంద్రబాబు, యానాలి సాంబశివరెడ్డి, కౌన్సిల్ సభ్యులు నూనె శశిధర్ తదితరులు పాల్గొన్నారు.

పత్తి చేలలో నిలిచిన నీరు


ముదిగొండ : కమలాపురం సమీపాన పత్తి చేనులో నిలిచిన నీరు


చింతకాని : కోమట్లగూడెంలో కొట్టుకపోయిన పత్తి చేను వద్ద రైతు

ముదిగొండ: ముదిగొండ మండలంలోని పలు చోట్ల సోమవారం భారీ వర్షం కురిసింది. ఆకస్మాత్తుగా మేఘాలు కమ్ముకుని మొదలైన వర్షం గంటన్నర పాటు కొనసాగింది.
దీంతో పంటలు సాగు చేస్తున్న రైతుల్లో హర్షం వ్యక్తమవుతోంది. అయితే, ఈ వర్షంతో పత్తి చేన్లలో నీరు నిలవగా, ఈదురుగాలులకు ఎదిగిన పత్తి మొక్కలు వంగిపోయాయి.

చింతకాని: చింతకాని మండలంలో సోమవారం కురి సిన భారీ వర్షంతో రైతులు ఊరట చెందారు. అయితే, కోమట్లగూడెంకు చెందిన కౌలు రైతు బత్తుల సాంబయ్య రెండెకరాల్లో సాగుచేసిన పత్తి పంటలో ఎకరం మేర వరదతో కొట్టుకుపోవడంతో కన్నీరుమున్నీరయ్యాడు.

మంత్రి కారు టైర్‌కు పంక్చర్


టైర్ మారుస్తున్న సిబ్బంది

ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో అభివృద్ధి పనులను సోమవారం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన వచ్చిన కారు టైర్ పంక్చర్ అయింది. దీంతో మంత్రి పరిశీలన ముగిసేలోగా సిబ్బంది కారు టైరు మార్చారు. – స్టాఫ్ ఫొటోగ్రాఫర్

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి పోరాటాలు



మాట్లాడుతున్న టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పద్మ

ఖమ్మంసహకారనగర్: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్‌పీసీ) ఆధ్వర్యాన నిర్వహించే పోరాటాలను జయప్రదం చేయాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావా రవి పిలుపునిచ్చారు. ఖమ్మంలో సోమవారం టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కమిటీ సమావేశం షేక్ రంజాన్ అధ్యక్షతన జరగగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 19నెలలు గడిచినా ఉద్యోగ, ఉపాధ్యాయులకు పీఆర్‌సీ ఇవ్వకుండా జాప్యం చేస్తోందన్నారు. ఇకనైనా పీఆర్‌సీ అమలుచేయడమే కాక ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీల షెడ్యూల్ ప్రకటించాలని, పెండింగ్ బిల్లులు విడుదల చేయాలనే డిమాండ్‌తో చేపట్టే దశలవారీ పోరాటంలో ఉపాధ్యాయులు పాల్గొనాలని కోరారు. ఈ సమావేశంలో జీ.వీ.నాగమల్లేశ్వరరావు, పారుపల్లి నాగేశ్వరరావు బుర్రి వెంకన్న, వల్లంకొండ రాంబాబు, దామోదర్, అరవింద్, రాంచంద్ పాల్గొన్నారు.

జయప్రదం చేయండి..

ఉపాధ్యాయ సమస్యలపై దశలవారీ పోరాటాలను జయప్రదం చేయాలని టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వై.పద్మ పిలుపునిచ్చారు. ఖమ్మంలోని యూనియన్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం ఈనెల 23, 24వ తేదీల్లో తహసీల్దార్లకు వినతిపత్రాలు ఇవ్వనుండగా, ఆగస్టు 1న జిల్లా కేంద్రంలో, ఆగస్టు 23న రాష్ట్రస్థాయిలో మహాధర్నా ఉంటుందని తెలిపారు. ఈ సమావేశంలో టీపీటీఎఫ్ కార్యదర్శి ఆకుల నాగేశ్వరరావు, నాయకులు గరిక శ్రీనివాస్, హన్మంతరావు, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

సాగర్ జలాలు విడుదల చేయాలి


మాట్లాడుతున్న సుదర్శన్‌రావు, పక్కన నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: సాగర్ ఆయకట్టు పరిధిలో వరి సాగు చేసే రైతుల ఇక్కట్లు తీర్చేలా సాగర్ జలాలు విడుదల చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్‌రావు డిమాండ్ చేశారు. ఖమ్మంలో సోమవారం రాష్ట్ర కమిటీ సభ్యురాలు మాచర్ల భారతి అధ్యక్షతన జరిగిన పార్టీ జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆయకట్టు రైతులు సాగర్ జలాలు వస్తాయనే ఆశతో నారుమళ్లు సిద్ధం చేసుకున్నందున నీరు విడుదల చేసి ఆదుకోవాలన్నారు. అలాగే, జిల్లాలో యూరియా కొరత లేకుండా పర్యవేక్షించాలని కోరారు. అంతేకాక అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలే తప్ప అధికార పార్టీ నేతలు, వారి అనుచరులకు చెప్పిన వారికి ఇవ్వాలనే యత్నాలు విరమించుకోవాలన్నారు. కాగా, ఆగస్టు 12 నుండి సెప్టెంబర్ 12వరకు సీపీఎం మాజీ కేంద్ర కమిటీ కార్యదర్శి సీతారాం ఏచూరి వర్ధంతి సభలను జిల్లా వ్యాప్తంగా నిర్వహించాలని, వీర తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలను గ్రామగ్రామాన జరపాలని సుదర్శన్‌రావు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, నాయకులు బండి రమేష్, కళ్యాణ వెంకటేశ్వరరావు, వై.విక్రమ్, బొంతు రాంబాబు, మాదినేని రమేష్, యర్రా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

తాళం పగులగొట్టి ఆభరణాలు, నగదు చోరీ

రఘునాథపాలెం: రఘునాథపాలెం మండలం బూడిదంపాడులో సోమవారం చోరీ జరిగింది. గ్రామంలోని ఎస్టీ కాలనీలో నివసిస్తున్న కేలోతు రూప ఆదివారం ఇంటికి తాళం వేసి ఊరు వెళ్లింది. తిరిగి సోమవారం వచ్చేసరికి ఇంటి తాళం, బీరువా పగులగొట్టి ఉండడాన్ని గుర్తించింది. దీంతో బీరువాలో పరిశీలించగా 20తులాల వెండి పట్టీలు, కడియాలు, చిన్నపిల్లల బంగారపు రింగులు, రూ.20వేల నగదు అపహరించినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేసింది. మొత్తం చోరీ సొత్తు విలువ రూ.50వేలు ఉంటుందని పేర్కొనగా, పోలీసులు చేరుకుని దర్యాప్తు చేపట్టారు.

యువకుడి మృతదేహం లభ్యం

వేంసూరు: ఏపీలోని వాడపల్లిలో గోదావరిలో గల్లంతైన యువకుడి మృతదేహం సోమవారం లభ్యమైంది. వేంసూరు మండలం లచ్చన్నగూడెంకు చెందిన పామర్తి సాయిదినేష్ ఈనెల 19న స్నేహితులతో కలిసి వాడపల్లిలో వెంకటేశ్వరస్వామి దర్శనానికి వెళ్లగా అక్కడ గోదావరిలో గల్లంతయ్యాడు. అప్పటి నుంచి రెస్క్యూ బృందాలు గాలిస్తుండడంగా సోమవారం మృతదేహం లభించడంతో కుటుంబీకులకు అప్పగించారు.

గుట్టపై మహిళ అస్థిపంజరం..

పెనుబల్లి: మండలంలోని కొత్తలంకపల్లి శివారు కుక్కలగుట్టపై ఓ మహిళ అస్థిపంజరాన్ని గుర్తించారు. పశువులు మేపేందుకు వెళ్లిన కాపరులు సోమవారం అస్థిపంజరాన్ని గుర్తించి వీఎం.బంజర్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో అక్కడ పరిశీలించగా 20 – 30 ఏళ్ల వయస్సు మహిళ మృతదేహాన్ని గుర్తించిన పోలీసులు సుమారు ఆరు నెలల క్రితం మృతి చెంది ఉండొచ్చనే భావనకు వచ్చారు. గ్రామపంచాయతీ కార్యదర్శి యలమద్ది మల్లికార్జున్‌రావు ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు హత్యా, ఆత్మహత్య అన్న కోణంలో విచారణ మొదలుపెట్టారు.

బావిలో దూకి మహిళ ఆత్మహత్య


జయమణి (ఫైల్)

పెనుబల్లి: మండలంలోని కొత్తకుప్పెనకుంట్లకు చెందిన గొల్లమందల జయమణి వ్యవసాయ బావిలో దూకి బలవన్మరణానికి పాల్పడింది. ఆర్థిక ఇబ్బందులతో దంపతులైన వంశీ – జయమణి మధ్య ఘర్షణ జరుగుతుండగా మనస్తాపానికి గురైన ఆమె ఇంటి వెనకాల వ్యవసాయ బావిలో దూకింది. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు వీఎం బంజర్ పోలీసులు మృతదేహాన్ని తీయించి విచారణ చేపడుతున్నామని ఎస్సై కె.వెంకటేష్ తెలిపారు. కాగా, జయమణికి భర్తతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు.

గేదె పంచాయితీలో దంపతులపై దాడి


నాగేశ్వరరావు దంపతులు

నేలకొండపల్లి: గేదె విషయమై జరిగిన పంచాయితీ దంపతులపై దాడికి దారి తీసింది. మండలంలోని శంకరగిరితండాకు చెందిన బానోత్ నాగేశ్వరరావు ఇంట్లోకి మరొకరి గేదె వస్తుండగా అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాల వారికి సోమవారం పంచాయితీ జరిగింది. ఈ క్రమాన మాటామాట పెరగగా నాగేశ్వరరావు, ఆయన భార్యపై ఎదుటి వర్గం వారు దాడి చేశారు. దీంతో గాయపడిన వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పత్తిలో సస్యరక్షణ చర్యలు కీలకం

మధిర: నాలుగు రోజుల నుంచి వర్షాలు చురుస్తున్నందున పత్తి పంట దెబ్బతినే అవకాశముంది. ఈనేపథ్యాన రైతులు చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలపై మధిర మండల వ్యవసాయ అధికారి కె.సాయి దీక్షిత్ పలు సూచనలు చేశారు. పత్తి వేసిన రైతులందరూ ఎప్పటికప్పుడు పొలంలోని నీరు బయటకు వెళ్లేలా చిన్నచిన్న కాలువలు చేసుకోవాలని తెలిపారు. ఎక్కువగా నీరు నిలిచిన చోట సూక్ష్మధాతు లోపం వచ్చే అవకాశముందున, 10 గ్రాముల యూరియా లేదా 19:19:19 లేదా 13:0:45 లీటర్ నీటిలో కలిపి వారంలో రెండుసార్లు పిచికారీ చేయాలని సూచించారు. అలాగే, ఎండు తెగులు ఆశించకుండా కాపర్ ఆక్సిక్లోరైడ్ 3 గ్రాములు లేదా కార్బన్డిజమ్ ఒక గ్రామును లీటర్ నీటిలో కలిపి మొక్క వేరు వ్యవస్థ తడిచేలా పిచికారి చేసుకోవాలని తెలిపారు. ఇక గడ్డి జాతి కలుపు నివారణకు క్విజలోఫోప్- ఇతయల్ 2 మి.లీ. లేదా ప్రపోక్విజాలోఫోప్ 1.25 మి.లీ.ను లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలని చెప్పారు. వెడల్పు ఆకు మొక్క నివారణకు బిస్పైరిబాక్ సోడియం 1.25 మి.లీ.ను లీటర్ నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలని తెలిపారు. అంతేకాక గడ్డి జాతి, వెడల్పు ఆకు నివారణకు రైతులు ఏజిల్, హిట్వీడ్ లేదా హిట్వీడ్ మాక్స్(బిస్పైరిబాక్ సోడియం, క్విజాలోఫోప్- ఇతయల్) 2.5 మి.లీ.ను లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేస్తే కలుపును నివారించవచ్చునని ఏఓ వివరించారు. కాగా, వరి నారుమడిలో అగ్గి తెగులు రావడానికి ఆస్కారం ఉన్నందున, ట్రైసైక్లోజోల్, మాంకోజెబ్ 2.5 మి.లీ.ను లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలని ఏఓ సాయిదీక్షిత్ సూచించారు.

నారు మడి.. కోక తడి !



మిర్చి సాగుకు సిద్ధమవుతున్న రైతులు నారు పెంచుతున్నారు. మడుల్లో మిరప గింజలను విత్తగా.. ఎండావాన నుంచి రక్షణకు పాత చీరలను వాడుతున్నారు. నారు మడులపై పాత చీరలు పరిచి నిత్యం నీరు పెడుతుండగా.. తేమ త్వరగా ఆరిపోదని చెబుతున్నారు. ఒకవేళ భారీ వర్షం కురిసినా గింజలు కొట్టుకుపోకుండా చీరలే కాపాడతాయని.. మొలకలు వచ్చాక వీటిని తీసివేస్తామని రైతులు తెలిపారు. కామేపల్లి మండలం పండితాపురం సమీపాన ఓ రైతు తన చేనులో నారుపై పరిచిన చీరలే ఇవి.. – కామేపల్లి